సాక్షి అల్లూరి సీతారామరాజు జిల్లా

సోమవారం, 30, సెప్టెంబర్, 2024



ప్రమాదస్థాయికి 'కోనాం'

చీడికాడ: కోనాం జలాశయం నీటిమట్టం ప్రమాదస్థాయికి చేరడంతో ఆదివారం దిగువకు 1000 క్యూసెక్కులు విడుదల చేశారు.



ఘనంగా కృష్ణమయ్య జయంతి

సింహాచలం : సింహగిరిపై ఆదివారం నుంచి శ్రీకాంత కృష్ణమాచార్య జయంత్యుత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి.

నేత్రపర్వం.. నృత్యోత్సవం



నాట్య ప్రదర్శనలతో కళాభారతి ఆడిటోరియం పులకించిపోయింది. మూడు రోజుల పాటు జరిగిన నృత్యోత్సవ్ ఆదివారంతో ముగిసింది.

8లో

న్యూస్‌రీల్

వారం రోజుల్లో ఇద్దరు శిశువుల మృతి



పులుసుమామిడిలో మృతిచెందిన శిశువు

జి.మాడుగుల: జిల్లాలో మాతా శిశు మరణాలు ఆగడం లేదు. అనారోగ్యం తదితర కారణాలతో మృత్యువాతపడుతున్నారు. మండలంలో బొయితిలి పంచాయతీ పులుసుమామిడి గ్రామంలో వారం రోజుల వ్యవధిలో అనా రోగ్యంతో ఇద్దరు శిశువులు మృతిచెందారు. ఈ నెల 22న తోటపల్లి లక్ష్మీపతికి కుమార్తె (4 నెలలు) మృతి చెందగా, ఆదివారం తరడా రమేష్‌కు కుమారుడు (3నెలలు) మరణించినట్టు గ్రామస్తులు తెలిపారు. వరుసగా శిశు మరణాలు సంభవిస్తుండడంతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. జిల్లా అధికారులు, వైద్యశాఖ అధికార్లు వెంటనే స్పందించి శిశు మరణాలను నివారించాలని సర్పంచ్ మాలన్న, గ్రామస్తులు కోరారు.

షెడ్యూల్డ్ ప్రాంతంలో సర్వాధికారాలు ఆదివాసీలకే

- దండకారణ్య ఉద్యోగ సమితి రాష్ట్ర సలహాదారుడు చెండా కేశవరావు



మాట్లాడుతున్న సలహాదారుడు చెండా కేశవరావు


చింతపల్లి: షెడ్యూల్డ్ ప్రాంతాల్లో సర్వాధికారాలు ఆదివాసీలకే ఉండాలని దండకారణ్య ఉద్యోగ సమితి రాష్ట్ర సలహాదారుడు డాక్టర్ చెండా కేశవరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమావేశ మందిరంలో ఆదివారం జరిగిన దండకారణ్య ఉద్యోగుల సమితి (డీఈవో) రాష్ట్ర కమిటీ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ఆదివాసీల కోసం రాజ్యంగంలో కల్పించిన ప్రత్యేక హక్కులు, చట్టాలను అధికారులు సమర్థంగా అమలు చేయాలన్నారు. ప్రధానంగా భూ బదలాయింపు 1/70 చట్టం ప్రకారం గిరిజన ప్రాంతలో భూములపై సర్వాధికారాలు ఆదివాసీలకు మాత్రమే ఉంటాయన్నారు. మాజీ అధ్యక్షుడు సమరెడ్డి మాణిక్యం మాట్లాడుతూ షెడ్యూల్డ్ ప్రాంతల్లో స్వపరిపాలన ఉండాలన్నారు. ఈకార్యక్రమంలో సలహాదారులు గుజ్జెలి కొండబాబు, డీఈవో జిల్లా సమన్వయకర్త టి.సుబ్బారావు, సహాయ కార్యదర్శి బోనంగి సత్యనారాయణ పడాల్, కమిటీ సభ్యులు కూడా కాసులమ్మ,మ కొప్పల లక్ష్మీ నారాయణమూర్తి, కుడుమూల శేఖర్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంక్ ఖాతాల్లో వరద పరిహారం నగదు జమ

- ఐటీడీఏ పీవో అపూర్వభరత్

చింతూరు: ఇటీవల వచ్చిన గోదావరి, శబరి నదుల వరద కారణంగా నష్టపోయిన వారి బ్యాంక్ ఖాతాల్లో పరిహారం సొమ్ము జమ అయినట్టు చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వభరత్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. చింతూరు, వీఆర్‌పురం, కూనవరం, ఎటపాక మండలాల్లోని వరద బాధితుల వివరాలు సచివాలయాల ద్వారా సేకరించి, పరిహారం జమ చేసినట్టు తెలిపారు. ఇంకా ఎవరికైనా పరిహారం అందకపోతే మూడు రోజుల్లో సమీప సచివాలయాల్లో దరఖాస్తులు అందజేయాలని, ఫిర్యాదులకు సంబంధించి చింతూరు ఐటీడీఏ కార్యాయలంలో ప్రత్యేక గ్రీవెన్స్ సెల్‌ను ఏర్పాటు చేశామని పీవో పేర్కొన్నారు.

అబ్బో.. ఏం మబ్బో



పాడేరులో ఎరుపు, పసుపు రంగుల మేళవింపుతో..



పెదబయలులో సప్తవర్ణాలతో మేఘమాలికలు



పాడేరులో కనువిందు చేసిన మేఘాలు

సూర్యాస్తమయ సమయంలో ఆకాశంలో కొంగొత్త అందాలు ఆవిష్కృతమయ్యాయి. సప్తవర్ణాలతో పాడేరు, పెదబయలులో ఆదివారం మేఘాలు కనువిందు చేశాయి. పెదబయలులో మేఘాల ప్రతిబింబాలు మత్స్యగెడ్డలో పడడంతో ఆ ప్రాంతం పసిడి రంగులో ప్రకాశించింది. కొండలు, పంట పొలాలు స్వర్ణ కాంతులతో అద్భుతంగా దర్శనమిచ్చాయి. ప్రకృతి ప్రేమికులు పెదబయలులో మత్స్యగెడ్డ వంతెన సమీపంలో ఫొటోలు తీసి, సెల్ఫీలు దిగడంతో పాటు ప్రకృతి అందాలను ఆస్వాదించారు.

–సాక్షి,పాడేరు/పాడేరు/ పెదబయలు

ఏయ్ బిడ్డా... ఇది మా అడ్డా



ఆంధ్రా, ఒడిశా సరిహద్దు ప్రాంతం

దట్టమైన అడవుల్లో అదొక చీకటి ప్రపంచం.. బయటకు కనపడని ప్రాంతం.. స్మగ్లింగ్ కార్యకలాపాలకు అడ్డాగా మారిన ఏరియా... అదే ఏవోబీ. ఆంధ్రా, ఒడిశా సరిహద్దులో ఒకప్పుడు మావోయిస్టుల ప్రాబల్యం ఎక్కువగా ఉండేది. ప్రస్తుతం వారి కార్యకలాపాలు తగ్గుముఖం పట్టగా ఇప్పుడు స్మగ్లర్లకు అడ్డాగా మారిపోయింది. పశువులు,తాబేళ్లు, తెల్లరాయి, గంజాయిని ఇతర రాష్ట్రాలకు స్మగ్లింగ్ చేస్తూ స్మగ్లర్లు కోట్లు గడిస్తున్నారు. గతంలో ఈ ప్రాంతం నుంచి కలప అక్రమ రవాణా భారీగా జరిగేది. అటవీశాఖ దాడులు ముమ్మరం చేయడంతో దిక్కుతోచని స్మగ్లర్లు ఇతర ఆదాయ మార్గాలపై దృష్టి సారించారు. అధునాతన టెక్నాలజీని వినియోగిస్తూ తమ కార్యకలాపాలను యథేచ్ఛగా సాగిస్తున్నారు.

- స్మగ్లింగ్ ముఠాలకు కేంద్రంగా ఏవోబీ
- ఒడిశా నుంచి యథేచ్ఛగా గంజాయి రవాణా
- పశువులు, తాబేళ్లు, తెల్లరాయి కూడా..

చింతూరు: ఆంధ్రా, ఒడిశా సరిహద్దుల్లో గంజాయి, పశువులు, తాబేళ్లు, తెల్లరాయి అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. వైరామవరం, జీకేవీధి మండలాల సరిహద్దు ప్రాంతాల నుంచి గంజాయి ఇతర రాష్ట్రాలకు అక్రమంగా రవాణా చేస్తున్నారు. చింతూరు మండల సరిహద్దుల నుంచి పశువులు, తాబేళ్లు, తెల్లరాయిని అక్రమంగా తరలిస్తున్నారు. తాజాగా సరిహద్దులను జూదగాళ్లు కోడిపందాలు, పేకాట అడ్డాలుగా మార్చేశారు.

లిక్విడ్ గంజాయి

వైరామవరం, జీకేవీధి మండలాల సరిహద్దు అవతల ఉన్న ఒడిశా రాష్ట్రం మల్కనగిరి జిల్లా కుర్మనూరు, నిమ్మనూరు, రాశిబేడ, గిల్లమడుగు, సన్యాసిగూడ, అల్లూరుకోట, గుర్రలూరు, దంతుగూడ, పప్పులూరు ప్రాంతాల్లో ఏటా రెండు విడతలుగా గంజాయి పండిస్తున్నారు. గంజాయిని 5, 10 కిలోల చొప్పున ప్యాకెట్లుగా చేసి, బస్తాల్లో నింపి సరిహద్దులను దాటించి జిల్లాలోని చింతూరు మండలం మీదుగా తెలంగాణ, మహారాష్ట్ర, తమిళనాడు తదితర ప్రాంతాలకు తరలిస్తున్నారు. వాహన తనిఖీల్లో పోలీసులు గంజాయిని పట్టుకుంటున్నా కొందరు స్మగ్లర్లు వారి కళ్లుగప్పి చాకచక్యంగా గంజాయిని తరలించుకుపోతున్నారు. ఈ క్రమంలో ఇక్కడినుంచి వెళుతున్న గంజాయిని తెలంగాణాలోని పలు ప్రాంతాల్లో పోలీసులు పట్టుకున్న ఘటనలున్నాయి. ఈ ఏడాది జూన్ నుంచి సెప్టెంబరు వరకు చింతూరు పోలీసు సబ్ డివిజన్లో రూ.1.14 కోట్ల విలువైన 2,275 కిలోల గంజాయి పట్టుబడగా 24 కేసులు నమోదుచేసి 64 మందిని పోలీసులు అరెస్టు చేశారు. కాగా బస్తాల్లో గంజాయిని తీసుకెళితే పోలీసులకు దొరికిపోతున్నందున స్మగ్లర్లు ఇటీవల లిక్విడ్ గంజాయిని తరలిస్తున్నారు.



ఒడిశా సరిహద్దుల్లో సాగు చేస్తున్న గంజాయి

తెల్లరాయి



చింతూరు మండలంలోని అటవీప్రాంతంలో నిలవ చేసిన తెల్లరాయి

ఏజెన్సీలో లభించే ఖనిజ సంపదను దోచుకుంటున్నారు. ఒడిశాతో పాటు చింతూరులో విలువైన తెల్లరాయి(క్వార్ట్జ) లభ్యమవుతోంది. ఒడిశా నుంచి తీసుకొచ్చిన రాయితో పాటు స్థానికంగా లభ్యమయ్యే రాయిని బినామీ పేర్లతో స్టాక్ పాయింట్‌లో నిల్వచేసి సరైన ధ్రువీకరణ పత్రాలు లేకున్నా రాత్రి సమయంలో అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు.

తాబేళ్ల అక్రమ రవాణా



ఒడిశాకు తరలించేందుకు అక్రమంగా తీసుకొచ్చిన తాబేళ్లు

మన రాష్ట్రంలోని రామచంద్రపురం, రావులపాలెం, కాకినాడ తదితర ప్రాంతాల్లోని చెరువుల్లో లభించే తాబేళ్లను ఒడిశాకు చెందిన స్మగ్లర్లు అధిక మొత్తంలో కొనుగోలు చేస్తున్నారు. వాటిని వాహనాల్లో రాత్రిపూట రవాణా చేస్తూ చింతూరు మండలంలోని కొత్తపల్లి, పొల్లూరు వద్ద సరిహద్దులను దాటించి ఒడిశాకు అక్రమ రవాణా చేస్తున్నారు. స్మగర్లు సాధారణ తాబేళ్లతో పాటు ఎంతో అరుదైన నక్షత్ర తాబేళ్లను కూడా రవాణా చేస్తున్నారు. అటవీశాఖ సిబ్బంది దాడులు నిర్వహిస్తూ తాబేళ్లను పట్టుకుంటున్నా అక్రమ రవాణా మాత్రం ఆగడంలేదు. ఏడాది పోలీసులు ఐదు కేసుల్లో ఆరుగురిని అరెస్టు చేసి, మూడు వేల తాబేళ్లను స్వాధీనం చేసుకున్నారు.

రూటు మార్చి..

చింతూరు మండలంలోని కొత్తపల్లి ప్రాంతాన్ని అడ్డాగా చేసుకుని స్మగ్లర్లు పశువుల అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. ఒడిశాలో కొనుగోలు చేసిన పశువులను సీలేరు నదిని దాటించి కొత్తపల్లికి చేర్చుతున్నారు. అక్కడినుంచి వాటిని పరిమితికి మించి వాహనాల్లో కుక్కి దారుణంగా తెలంగాణ, కేరళతో పాటు ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. వాహనాల తనిఖీ అధికం కావడంతో పశువులు పట్టుబడుతున్న క్రమంలో స్మగ్లర్లు రూటుమార్చి పశువులను కాలినడకన సుదూర ప్రాంతాలకు తీసుకెళ్లి అక్కడ వాహనాల్లో ఎక్కించి రవాణాకు పాల్పడుతున్నారు. గత ఏడాది పోలీసులు ఆరు కేసుమోదు చేసి, 400 పశువులను స్వాధీనం చేసుకున్నారు.పశువుల అక్రమ రవాణాలో హైదరాబాద్, గోకవరానికి చెందిన వ్యాపారులతో పాటు చింతూరు మండలానికి ఓవ్యక్తి కీలకపాత్ర పోషిస్తున్నట్లు తెలిసింది.



ఒడిశా సరిహద్దుల నుంచి కాలినడకన తీసుకొస్తున్న పశువులు

ముమ్మరంగా తనిఖీలు



చింతూరు సబ్ డివిజన్ పరిధిలో గంజాయి రవాణాను నిరోధించేందుకు ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నాం. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో వాహనాల తనిఖీలు నిర్వహించడంతో పాటు అనుమానాస్పద ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నాం. ఒడిశా నుంచి మన రాష్ట్రంలోకి గంజాయి రాకుండా సరిహద్దుల్లో పకడ్బందీగా చర్యలు చేపడుతున్నాం

–పంకజ్ కుమార్ మీనా, ఏఎస్పీ, చింతూరు

పండక్కి ప్రత్యేక రైళ్లు



తాటిచెట్లపాలెం(విశాఖ): పండగల వేళల్లో పలు ప్రత్యేక రైళ్లు నడపడంతోపాటు పలు రైళ్లకు అదనపు కోచ్‌లను జతచేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ సందీప్ తెలిపారు. విశాఖపట్నం-సికింద్రాబాద్-విశాఖపట్నం, విశాఖపట్నం-తిరుపతి-విశాఖపట్నం, విశాఖపట్నం-బెంగళూరు-విశాఖపట్నం, విశాఖపట్నం-అరకు-విశాఖపట్నం, విశాఖపట్నం - ఎంజీఆర్ చెన్నై - విశాఖపట్నం, విశాఖపట్నం-షాలిమర్- విశాఖపట్నం, శ్రీకాకుళం రోడ్-తిరుపతి-శ్రీకాకుళం రోడ్, శ్రీకాకుళం రోడ్-కొల్లాం- శ్రీకాకుళం మధ్య ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు పేర్కొన్నారు. ఇవి కాకుండా పలు రెగ్యులర్ రైళ్లకు జనరల్ క్లాస్, స్లీపర్ క్లాస్, థర్డ్ ఏసీ వంటి కోచ్‌లను అదనంగా జతచేస్తున్నట్లు తెలిపారు.

సెంట్రల్ జైల్‌లో హీరో నాని



లొకేషన్‌లో నటుడు నాని

కొమ్మాది(విశాఖ) : ఆడవివరం సెంట్రల్ జైల్‌లో ఆదివారం సినిమా షూటింగ్ సందడి నెలకొంది. నేచురల్ స్టార్ నాని నటిస్తున్న హిట్-3 సినిమాకు సంబంధించిన కొన్ని సన్నివేశాలను ఈ పరిసర ప్రాంతాల్లో చిత్రీకరించారు. ఈ సినిమాకు శైలేష్ కొలను దర్శకత్వం వహిస్తున్నారు. సోమవారం నుంచి విశాఖపట్నంలో పలు ప్రాంతాల్లో ఈ సినిమా చిత్రీకరణ ఉంటుందని సినిమా యూనిట్ తెలిపింది.

నిర్లక్ష్యానికి నిండు ప్రాణాలు బలి

కొద్ది నిమిషాలు గడిస్తే తండ్రి కూతురును చూసేవాడు... మరో వ్యక్తి తన గమ్యాన్ని చేరేవాడు. అంతలోనే మృత్యువు కారు రూపంలో దూసుకొచ్చి వారి ప్రాణాలు బలిగొంది.. కారు డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా రావణాపల్లి సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతిచెందారు.



మరణించిన రాజుబాబు

- రావణాపల్లి వద్ద బైక్‌ను ఢీకొన్న కారు
- ఇద్దరి మృతి
- కూతురి దగ్గరకు వెళ్లకుండానే తండ్రి తిరిగిరాని లోకాలకు ..



రోడ్డు కిందకు దూసుకు పోయిన కారు

కొయ్యూరు: రావణాపల్లి బాలికల ఆశ్రమ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న కూతురు రేష్మాను ఇంటికి తీసుకువచ్చేందుకు రాజేంద్రపాలెంకు చెందిన అంబటి అప్పన్న స్వామి(38) ఆదివారం ఉదయం బైక్‌పై బయలుదేరాడు. అదే సమయంలో గొలుగొండ మండలం చీడిగుమ్మల పంచాయతీ ఎరకంపేటకు చెందిన యాదగిరి రాజుబాబు(58) కూడా అక్కడ వరకు వస్తానని స్వామి బైక్ ఎక్కాడు. రావణాపల్లి సమీపంలో రేగడివీధి జంక్షన్ వరకు బాగానే వెళ్లారు. కొద్ది నిమిషాల్లో రావణాపల్లి వెళ్తారనగా కృష్ణదేవిపేట నుంచి అతివేగంగా వచ్చిన కారు చింతాలమ్మ గుడికి ఎదురుగా బైక్‌ను ఢీకొంది. దీంతో బైక్ వెనుక సీటుపై ఉన్న రాజుబాబు సుమారు పది మీటర్ల దూరంలో పడి మృతి చెందాడు. తీవ్ర గాయాలైన స్వామికి కృష్ణదేవిపేట ఆస్పత్రిలో చికిత్స చేసిన అనంతరం మెరుగైన వైద్యం కోసం నర్సీపట్నం తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో మరణించాడు. చింతాలమ్మ గుడికి వెళ్లేందుకు కారులో ప్రయాణిస్తున్న ఆరుగురిలో ఒకరు గాయపడడంతో నర్సీపట్నం తరలించారు.

కన్నీరుమున్నీరుగా..: మరణించిన అంబటి స్వామి ఇక్కడ వైస్ ఎంపీపీ అంబటి నూకాలుకు స్వయాన సోదరుడు. స్వామికి భార్య దేవి, కూతురు రేష్మా, కొడుకులు సుశాంత్, లక్ష్మితేజ ఉన్నారు. తండ్రి మరణ వార్త విన్న వారంతా తీవ్రంగా రోదించారు. స్వామి గతంలో డ్రైవర్‌గా పనిచేసేవాడు. ఇప్పుడు వ్యవసాయ కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. స్వామి మరణించడంతో తమకు దిక్కెవరంటూ కుటుంబ సభ్యులు గుండెలవిసేలా విలపించారు. ప్రమాదంలో మరణించిన రాజుబాబు ఏజెన్సీ ప్రాంతంలో కోళ్లను కొనుగోలు చేసి మైదాన ప్రాంతాల్లో విక్రయిస్తుంటాడు. ఆదివారం కొయ్యూరు వచ్చి తిరిగి వెళ్తుండగా ప్రమాదానికి గురయ్యాడు. నిర్లక్ష్యంగా కారు నడిపి ఇద్దరి మరణానికి కారణమైన డ్రైవర్ రమణను కొయ్యూరు పోలీసులు అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ప్రమాద స్థలంలో అప్పన్న స్వామి



అప్పన్న స్వామి (ఫైల్)



రాజుబాబు (ఫైల్)

దంచికొట్టిన వర్షం

జిల్లాలోని పలు మండలాల్లో ఆదివారం భారీ వర్షం కురిసింది. వాగులు, గెడ్డలు పొంగి ప్రవహించాయి. రోడ్లు జలమయమయ్యాయి. పర్యాటక ప్రాంతాల సందర్శనకు వచ్చిన టూరిస్టులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

- చాపరాయి జలపాతం మూసివేత



చాపరాయి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వరద నీరు



దుంబ్రిగుడలో మామిడి చెట్టు వీధి వద్ద ప్రవహిస్తున్న వర్షం నీరు

దుంబ్రిగుడ: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం మధ్యాహ్నం భారీ వర్షంకురిసింది. ప్రముఖ పర్యాటక కేంద్రమైన చాపరాయి జలపాతం వద్ద ఉధృతంగా నీరు ప్రవహించడంతో మధ్యాహ్నం నుంచి చాపరాయిని మూసివేశారు. సందర్శించేందుకు అనుమతించకపోవడంతో దూరప్రాంతాల నుంచి వచ్చిన పర్యాటకులు నిరాశ చెందారు. ఇక్కడ రోడ్డుపై థింసా నృత్యాలను తిలకించి, స్థానికంగా లభించిన బ్యాంబూ బిర్యానీ ఆరగించారు. పెద్ద ఎత్తున ఉరుములు, మెరుపులు రావడంతో మండల ప్రజలు భయాందోళనకు గురయ్యారు. అరకు, కించుమండ, గుంటసీమ, సొవ్వ,దుంబ్రిగుడలలో ఓ మోస్తరు నుంచి భారీ వర్షం పడింది. దుంబ్రిగుడలో మామిడి చెట్టు వీధితో పాటు ప్రభుత్వం బాలుర ఆశ్రమ పాఠశాల వద్ద డ్రైనేజీలు పొంగి ప్రవహించాయి. పలు ఇళ్లలోకి నీరు చేరింది.

పెదబయలు:మండలంలో ఆదివారం మధ్యాహ్నం ఉరుములతో కూడిన భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి 8 గంటల నుంచి ఎండతీవ్రంగా ఉండగా, మధ్యాహ్నం ఒక్క సారిగా వాతావరణం మారి భారీ వర్షం కురిసింది. శనివారం అర్ధరాత్రి నుంచి సుమారు రెండు గంటల పాటు కుండపోతగా వర్షం పడింది. మెట్ట పంటలకు ఈ వర్షం అనుకూలమని రైతులు హర్షం వ్యక్తం చేశారు.



పెదబయలులో భారీగా కురుస్తున్న వర్షం



కొత్తపల్లి జలపాత ప్రాంతంలో కురుస్తున్న వర్షం

జి.మాడుగుల: మండలంలోని కుండపోతగా వర్షం కురిసింది. పాడేరు, జి.మాడుగుల, చింతపల్లితో పాటు సొలభం,గడుతూరు, వంజరి, గెమ్మెలి, కుంబిడిసింగి, లువ్వాసింగి రోడ్లు జలమయమయ్యాయి. దీంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. హైవే నిర్మాణ పనులకు ఆటంకం ఏర్పడింది. వర్షం కారణంగా కొత్తపల్లి జలపాతానికి పర్యాటకులు రాకపోవడంతో ఈ ప్రాంతం వెలవెలబోయింది.

నేత్రపర్వం..నృత్యోత్సవం


నాట్య కళాకారులను సన్మానిస్తున్న నిర్వాహకులు

మద్దిలపాలెం: భారతీయ సంప్రదాయ నాట్య ప్రదర్శనలతో కళాభారతి ఆడిటోరియం పులకించిపోయింది. దేశం నలుమూలల నుంచి వచ్చిన నాట్యకళాకారులు తమ ప్రదర్శనలతో ఓలలాడించారు. మూడు రోజులుగా జరిగిన వైశాఖీ నృత్యోత్సవ్ ఆదివారంతో ముగిసింది. కార్యక్రమాన్ని సూదగాని రవిశంకర్ నారాయణ్, నటరాజ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు బీఆర్ విక్రమ్ కుమార్ గౌడ్ తదితరులు ప్రారంభించారు. ఒడిశాకు చెందిన రూపశ్రీ మహాపాత్ర బృందం మహరి నృత్య రూపకం విశేషంగా ఆకట్టుకోగా..చైన్నైకి చెందిన ప్రముఖ కూచిపూడి నాట్య నిపుణుడు, మాధవపెద్ది మూర్తి తన బృందంతో కలిసి ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు కనువిందు చేశాయి. కేరళకు చెందిన నాట్యశ్రీ బిరుదాంకితురాలు చిత్రా సుకుమారన్ చేసిన మోహినీయాట్టం అలరించింది. డాక్టర్ పేరాల బాల మురళీకృష్ణ వ్యాఖ్యతగా వ్యవహరించారు. ఈ ప్రతిష్టాత్మక నృత్యోత్సవాల సందర్భంగా ప్రదర్శనానంతరం ఆయా కళాకారులు అవార్డులు అందజేశారు. ప్రఖ్యాత కూచిపూడి నాట్య నిపుణుడు మాధవపెద్ది మూర్తి (చెన్నై) వైశాఖీ నేషనల్ ఎక్సలెన్స్ అవార్డు–2024 అందుకున్నారు. ఒడిశాకు చెందిన నళినీ నిరూర్ నాయక్‌కు, కేరళకు చెందిన మోహినీయాట్టం కళాకారిణి చిత్ర సుకుమారన్‌కు వైశాఖీ ఎక్సలెన్స్ పురస్కారాలు అందజేశారు.

క్రిమిసంహారక మందు తాగి వ్యక్తి మృతి

అనకాపల్లి: క్రిమిసంహారక మందు సేవించి ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందినట్లు పట్టణ ఎస్ఐ సంతోష్ ఆదివారం తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు... ప్రకాశం జిల్లా పామర్రు మండలం పుట్టనాయుడుపాలెం గ్రామానికి చెందిన రామవరపు వరహ శ్రీనివాసరావు(34)కు తొమ్మిది సంవత్సరాల క్రితం వివాహమైంది. అప్పట్లోనే ఆరు మాసాల క్రితం కుటుంబ కలహాలు కారణంగా విడిపోయారు. ఈ నేపథ్యంలో నాలుగు రోజుల క్రితం మండలంలోని బీఆర్టీ కాలనీలో తన అక్క రామలక్ష్మి ఇంటికి వచ్చాడు. శనివారం ఆమె బయటకు వెళ్లిన సమయంలో క్రిమిసంహారక మందు సేవించి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. ఇంటికి తిరిగి వచ్చిన ఆమె గమనించి హుటాహుటిన అనకాపల్లి ప్రైవేట్ ఆస్పత్రిల్లో చేర్పించింది. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. రామలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

జోరుగా కల్తీ తేనె విక్రయాలు

- పుట్టగొడుగుల్లా తేనెపట్టు పరిశ్రమలు


విక్రయిస్తున్న తేనె బాటిళ్లు


అరకు సమీపంలో తేనె పట్టు పరిశ్రమ

దుంబ్రిగుడ: మండలంలోని పర్యాటక సీజన్ కావస్తుండడంతో పుట్టగొడుగులా తేనేపట్టు పరిశ్రమలు పుట్టుకొస్తున్నాయి. అరకు, జైపూర్ జంక్షన్, రైల్వే ట్రాక్, కురిడి, పంతలచింత, అంత్రిగుడలలో ఈ కల్తీ తేనె పరిశ్రమలు పుట్టుకువస్తున్నాయి. మైదాన ప్రాంతం పర్యాటకులకు మన్యం తేనె అంటే ఎంతో ప్రీతి...దీంతో ఈ ప్రాంతంలో ఎక్కడ తేనే లభించినా అది స్వచ్ఛమైనదిగానే భావిస్తారు.. దీంతో అధిక మొత్తంలో ధరలు వెచ్చించి కొనుగోలు చేసి మోసపోతున్నారు. గిరిజన ప్రాంతంలోని కొండ, కోనల్లో దొరికే ఒరిజినల్ తేనే లభ్యం కావడం ఎంతో కష్టంగా ఉంటుంది. అలాంటిది సంవత్సరం పొడవునా తేనె బాటిళ్లను అమ్ముతూ వ్యాపారులు కాసులు కురిపించుకుంటున్నారు. ఇక్కడ విచ్చలవిడిగా తేనే దందా జరుగుతుంటే అధికారులు మాత్రం నోరు వెళ్లబుచ్చుకుని చూస్తున్నారు. మన్యంలో కేవలం అక్టోబర్, నవంబర్, డిసెంబర్ సీజన్‌లో మాత్రమే వలిసె, పొద్దుతిరుగుడు పూలు కాపు వస్తుంది. దీంతో ఆ సీజన్‌లో తేనేటీగలు పువ్వుల నుంచి మకరందాన్ని సేకరించి తేనేపట్టు కడుతుంది. అటువంటి తరుణంలో ఇక్కడ ఒరిజినల్ తేనే నలుపు రంగులో ఉండి చిక్కగా ఉంటాయి. కల్తీ తేనే పెట్రోల్ రంగులో ఉంటుంది. కల్తీ తేనె విషయాన్ని పర్యాటకులు గ్రహించలేకపోతున్నారు. ఈ విషయమై మండలస్థాయి అధికారులు తేనే పట్టు పరిశ్రమలు అరికట్టేందుకు చర్యలు తీసుకోకపోవడంతో వీరి ఆగడాలకు బలిఅవుతున్నా పర్యాటకులు ఒక్కొక్క బాటిల్ సీజన్లో రూ. 400 నుంచి రూ. 800 వరకు కొనుగోలు చేస్తు ఇబ్బందులు పడుతున్నారు. తహసీల్దార్ నాగమ్మ మాట్లాడుతూ మండల కల్తీ తేనె విక్రయాలు జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

పారా పోటీల్లో దివ్యాంగులు మురిసె.!

- స్విమ్మింగ్ పోటీల చాంపియన్ విశాఖ
- జిమ్నాస్టిక్‌లో చిన్నారుల అద్భుత ప్రదర్శన
- రైఫిల్ షూటింగ్‌లో సత్తా చాటిన షూటర్లు


జిమ్నాస్టిక్ విజేతలకు బహుమతుల ప్రదానం


పోటీలక సిద్ధమవుతున్న స్విమ్మర్లు


రైఫిల్ షూటింగ్ చేస్తున్న రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ వైస్ చైర్మన్, ఎండీ గిరీశ


పోటీల్లో ప్రతిభచాటిన అంధ చిన్నారులు

విశాఖ స్పోర్ట్స్: విశాఖలో ఆదివారం క్రీడా పండగ జరిగింది. పారా స్విమ్మింగ్, రైఫిల్ షూటింగ్, జిమ్నాస్టిక్స్ రాష్ట్ర స్థాయి పోటీల్లో దివ్యాంగ క్రీడాకారులు అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. దివ్యాంగ స్విమ్మర్లు పూల్‌లో సత్తాచాటగా.. లక్ష్య సాధనలో రైఫిల్ షూటర్లు పోటీపడ్డారు. జిమ్నాస్టులు తమ విన్యాసాలతో అలరించారు. రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ వైస్ చైర్మన్, ఎండీ గిరీశ రైఫిల్ షూటింగ్ చేసి ఔత్సాహిక క్రీడాకారుల్లో ఉత్సాహం నింపారు. కలెక్టర్ హరేంధిర ప్రసాద్ చిన్నారుల విన్యాసాలను ఆసక్తిగా తిలకించారు. విజేతలకు సర్టిఫికెట్లు అందించారు. పారా స్విమ్మింగ్ పోటీల్లో విజేతలను రాష్ట్ర జట్టుకు ఎంపిక చేశారు.

స్విమ్మింగ్‌లో... : రైల్వే స్టేడియం ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో పారా స్విమ్మింగ్ పోటీలు జరిగాయి. ఎస్ 4 కేటగిరీ నుంచి ఎస్ 14 వరకు 90 మంది పారా స్విమ్మర్లు పోటీపడ్డారు. ఫ్రీస్టయిల్, బ్యాక్‌స్ట్రోక్ లాంటి 50, వంద మీటర్ల స్విమ్మింగ్ అంశాల్లో పలువురు దివ్యాంగ స్విమ్మర్లు తమ ప్రత్యేకతను ప్రదర్శించారు. బ్లైండ్(అంధత్వం) పారా స్విమ్మర్లు సైతం వారి కేటగిరీల్లో పోటీ పడి సత్తాచాటారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులు రాష్ట్ర జట్టుగా వచ్చే నెల 19 నుంచి 22 వరకు గోవాలో జరిగే పోటీలకు హాజరవుతారు. విశాఖ పారా స్విమ్మర్లు చాంపియన్‌షిప్‌ను సా ధించగా.. కృష్ణా జిల్లా సిమ్మర్లు ద్వితీయస్థానంలో, శ్రీకాకుళం జిల్లా స్విమ్మర్లు తృతీయస్థానంలో నిలి చారు. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ పర్యవేక్షణలో పారా స్పోర్ట్స్ సంఘం ఆధ్వర్యంలో ఈ పోటీలు జరిగాయి.

అలరించిన చిన్నారుల విన్యాసాలు

పాండురంగాపురంలోని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఇండోర్ హాలులో జిమ్నాస్టిక్స్ చాంపియన్‌షిప్‌లో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సమతుల్యత, బలం, చురుకుదనం, సమన్వయం తదితర అంశాలను కళాత్మకంగా ప్రదర్శించి శాప్ ఎండీ, కలెక్టర్‌లను అబ్బురపరిచారు. చిన్నారులు చేసిన ప్రదర్శనను వీరు ఆసక్తిగా వీక్షించారు. వైఎంసీఏ వద్ద జరిగిన రైఫిల్ షూటింగ్‌లో శాప్ ఎండీ క్రీడాకారుడిగా పోటీ పడ్డారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను అభినందించి సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. జిమ్నాస్టిక్స్‌ను ప్రోత్సహించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా తెలిపారు.



క్యాన్సర్‌ను ఓడించి.. క్రీడల్లో మెరిసి..!

కష్టాలను జయించి.. స్వప్నాలను సాకారం చేసుకున్న పోరాట యోధురాలు ఆమె. చిన్న వయసులోనే క్యాన్సర్ తన జీవితాన్ని కుదిపేసినా ధైర్యంగా ఎదుర్కొంది. ఈ క్రమంలో కాలు కోల్పోయినా.. ఆత్మస్థైర్యం మాత్రం కోల్పోలేదు. తన బలహీనతను బలంగా మార్చుకుని.. పోరాటానికి సిద్ధమైంది. పారా క్రీడల్లో తనను తాను నిరూపించుకుంటూ.. రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచింది. ఆమే మధురవాడకు చెందిన నిధి. ఆమె ఒక క్రీడాకారిణిగానే కాకుండా.. కష్టాలను ఎలా అధిగమించాలని అనే దానికి ఒక సాక్ష్యం. ఆమె కథ మనందరికీ స్ఫూర్తినిస్తుంది. ఆమె విజయాలు ప్రేరణగా నిలుస్తాయి. భవిష్యత్తులో నిధి మరెన్నో విజయాలు సాధించాలని ఆకాంక్షిద్దాం. – విశాఖ స్పోర్ట్స్

- పారా పోటీల్లో 'నిధి'సత్తా
- పతకాలు కొల్లగొడుతున్న మధురవాడ బాలిక


పారా పోటీల్లో సత్తాచాటుతున్న నిధి

విశాఖలో జరిగిన రాష్ట్రస్థాయి పారా స్విమ్మింగ్ పోటీల్లో నిధి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కృత్రిమ కాలుతో నడుస్తూ.. నాలుగు క్రీడాంశాల్లో పోటీపడుతున్న ఆమె చిన్న వయసులోనే ఎన్నో కష్టాలను ఎదుర్కొంది. మధురవాడ ప్రాంతానికి చెందిన నిధి తండ్రి కేశవరావు, తల్లి జ్యోతి. ప్రస్తుతం ఆమె 10వ తరగతి చదువుతోంది. ఏడేళ్ల వయసులోనే ప్రపంచంలో అత్యంత ప్రమాదకరమైన, ప్రాణాంతకమైన వ్యాధుల్లో ఒకటైన క్యాన్సర్ బారిన పడింది. చికిత్సలో భాగంగా ఆమె ఎడమ కాలును కోల్పోయింది. ఈ క్రమంలో ఎన్నో కష్టాలను ఎదుర్కొని.. క్యాన్సర్‌ను జయించి మామూలు స్థితికి చేరుకుంది. అంగవైకల్యాన్ని మరిచిపోయేందుకు ఆటలను ఎంపిక చేసుకుంది. కృత్రిమ కాలుతో కదన రంగంలోకి దిగింది. పట్టుదలతో స్విమ్మింగ్, చదరంగం, రైఫిల్ షూటింగ్, రన్నింగ్‌లో శిక్షణ పొందింది. పారా క్రీడల్లో తాను తలపడుతున్న అన్ని అంశాల్లోనూ నేడు పతకాలు సాధించే స్థాయికి చేరుకుంది. ఇటీవల రష్యాలో జరిగిన పారా క్రీడల్లో నాలుగు పతకాలను సొంతం చేసుకుంది.

మలుపు తిప్పిన సర్వైవర్స్ క్యాంప్

అంగవైకల్యం ఏర్పడినా క్యాన్సర్‌ను జయించిన నిధి నిబ్బరంగానే నిలిచింది. చదువుకుంటూనే తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఆటలపై ఆసక్తిని పెంచుకుంది. అప్పట్లో ముంబయిలో క్యాన్సర్ చికిత్స తీసుకున్న ఆమె.. క్యాన్సర్ సర్వేవర్స్ ఆత్మస్థైర్యాన్ని నింపేందుకు నిర్వహించిన పోటీల్లో పాల్గొంది. తనలాంటి వారితో నిర్వహించే పోటీల్లో పోటీపడగలననే ధీమాతో.. వారిచ్చిన శిక్షణ కార్యక్రమాల్లో పాల్గొంది. అలా రాంచీలో జరిగిన జాతీయస్థాయి చదరంగం అండర్–19 పోటీల్లో తొలిసారి పాల్గొని సత్తా చాటింది.

జాతీయ పారా స్విమ్మింగ్ పోటీలకు ఎంపిక

2019లో కరోనా కారణంగా పోటీల్లో పాల్గొనడం కాస్త తగ్గించింది నిధి. అప్పటికే ముంబయి నుంచి విశాఖకు తల్లిదండ్రులతో వచ్చేసిన నిధి తిరిగి గ్వాలియర్‌లో జరిగిన పారా స్విమ్మింగ్ పోటీల్లో తన కేటగిరీలో కాంస్య పతకాన్ని సొంతం చేసుకుంది. ఇటీవల రష్యాలో జరిగిన రైఫిల్ షూటింగ్‌లో కాంస్య పతకం, చెస్, స్విమ్మింగ్‌లతో పాటు రన్నింగ్‌లో స్వర్ణ పతకాలను అందుకుంది. ఆదివారం విశాఖలో జరిగిన రాష్ట్ర స్థాయి పారా స్విమ్మింగ్ పోటీల్లో ఎస్–9 కేటగిరీలో తలపడింది. 50 మీటర్ల ఫ్రీస్టయిల్, బ్యాక్ స్ట్రోక్, వంద మీటర్ల ఫ్రీస్టయిల్ పోటీల్లో విజేతగా నిలిచింది. వచ్చే నెలలో గోవాలో జరగనున్న జాతీయ పారా స్విమ్మింగ్ పోటీలకు సిద్ధమవుతోంది.

సాక్షి క్లాసిఫైడ్స్

Education

■ AU డిస్టెన్స్ ఎడ్యుకేషన్ BA, B.Com, B.Sc, MA, M.Com, M.Sc, MBA, MCA & AP ఓపెన్ స్కూల్ ద్వారా డైరెక్ట్ 10th & Inter One Sitting. అడ్మిషన్లు జరుగుచున్నవి. పాస్ గ్యారంటీ గైడెన్స్. ఫోన్ : 85006 23868, 90590 86040 [V- 2692]

Real Estate

PLOT FOR SALE

■ 650, 800 గజాలు గాజువాక జగ్గు జంక్షన్‌కు దగ్గరలో మరియు 75 గజాలు తుంగ్లంలో అమ్మకానికి కలవు. ఫోన్ : 73864 14017 [V- 786938]

Services

ASTROLOGY

■ శ్రీ సాయిదుర్గ జ్యోతిష్యాలయం, 9 సం॥లుగా స్థిరంగా ఉన్నారు. స్త్రీ/పు॥ ప్రేమ పెళ్ళి, వ్యాపారం, గ్రహదోష, వశీకరణ, ఎటువంటి సమస్యలకైనా 21 రోజులలో పరిష్కారం. SR మాల్ ప్రక్కన, కొత్త గాజువాక సంప్ర॥ 7702201190. [W-1239999]

GOLD LOANS

■ లోకేష్ గోల్డ్ లోన్స్ :- బ్యాంక్/ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదే రోజు మార్కెట్ రేటుకు కొనబడును. సంప్ర :- 98484 88068/ 77992 23300 [V- 12484]

Wanted

■ Govt. Reg. సంస్థ నందు Part Time / Full Time జాబ్ చేయుటకు యువతి / యువకులు కావలెను మరియు Tele Callers, Receptionists కావలెను. ఫోన్ : 82973 69677, 94933 56534 [V- 6563]

■ ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీ పురుషులు కావలెను. Qul:10th-డిగ్రీ, మీ అడ్రస్ వాట్సప్ చేయగలరు. వర్క్ ఫ్రం హోం అవకాశం కలదు. 7702473949 [G-9055]

■ మా వైజాగ్ బ్రాంచ్ నందు పనిచేయుటకు 1) సూపర్ వైజర్లు, 2) వర్కర్లు కావలెను. పూర్తి ధరఖాస్తుతో సంప్రదించండి. ఇండియన్ పెస్ట్ కంట్రోల్, ఫస్ట్‌ఫ్లోర్, భారత్ పెట్రోల్ బంక్ ఎదుట, ఆటోమోటివ్ ఎదురుగా, మద్దెలపాలెం, వైజాగ్ ✆ 83670 33999 [B-493]

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్దులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఉచిత వసతి + భోజనం. జీ: 18k. ఫోన్: 9640258899, 9640468899 [H-796281]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి క్లాసిఫైడ్స్ లలితానగర్, అక్కయ్యపాలెం, విశాఖపట్నం - 16.

మీ ప్రాంతంలోని మా ప్రతినిధులను సంప్రదించండి:

అనకాపల్లి : 9010546644
యలమంచిలి : 9951602901
చోడవరం : 9010210265
నర్సీపట్నం : 9010234557
పాడేరు : 9010973030

విశాఖపట్నం, అనకాపల్లి + అల్లూరి జిల్లా
నాలుగు లైన్లు రూ.475/-
అదనపు లైను రూ.100/-
+ 5% జి.ఎస్.టి. అదనం

స్టీల్ కాంట్రాక్ట్ కార్మికుల జోలికొస్తే ఖబడ్దార్

- సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు హెచ్చరిక
- కూర్మన్నపాలెం నుంచి నెల్లిముక్కు వరకు మహాపాదయాత్ర


మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగరావు



పాదయాత్రలో పాల్గొన్న కార్మికులు

పెదగంట్యాడ/అగనంపూడి: స్టీల్ కాంట్రాక్ట్ కార్మికుల ఉపాధి జోలికొస్తే ఖబడ్దార్ అని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్.నర్సింగరావు హెచ్చరించారు. స్టీల్ సీఐటీయూ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం మహాపాదయాత్ర నిర్వహించారు. కూర్మన్నపాలెం నుంచి పెదగంట్యాడ నెల్లిముక్కు వరకు మహా పాదయాత్ర అనంతరం బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌పై ప్రభుత్వ, యాజమాన్యాల వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు.. ఆ నేరాన్ని కాంట్రాక్ట్ కార్మికులపై నెట్టడం వేయడం సరికాదన్నారు. అందులో భాగంగానే కాంట్రాక్ట్ కార్మికులను ఉపాధికి దూరం చేస్తున్నారని ఆరోపించారు. వీరిలో తమ విలువైన భూములను ప్లాంట్ కోసం త్యాగం చేసిన నిర్వాసితులు ఉన్నారని, వారి ఉపాధికి గండి కొట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయని ధ్వజమెత్తారు. ఎన్నికల ముందు నేటి పాలకులు ఇచ్చిన హామీలు మరచి నేడు కేంద్ర ప్రభుత్వానికి వంత పాడుతున్నట్టు అనుమానిస్తున్నామన్నారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కె.ఎం.శ్రీనివాస్, జిల్లా నాయకుడు జగన్ మాట్లాడుతూ ప్రజల నమ్మకాన్ని వమ్ము చేసే విధంగా ప్లాంట్‌లోని పరిణామాలు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ఎంపీ, ఎమ్మెల్యేలు కేంద్ర ప్రభుత్వం, ప్లాంట్ యాజమాన్య వైఖరిని ప్రశ్నించాలని డిమాండ్ చేశారు. స్టీల్ సీఐటీయూ గౌరవాధ్యక్షుడు జె.అయోధ్యరామ్, ప్రధాన కార్యదర్శి రామస్వామి మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌ను పూర్తి సామర్థ్యంతో నడిపించడం చేతకాని యాజమాన్యం కార్మికుల సంఖ్యపైన, వారి హక్కులపై మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు. సీఐటీయూ నాయకుడు ఎం.జగ్గునాయుడు కాంట్రాక్ట్ కార్మికుల ఉపాధికి గండికొడితే పెద్ద ఎత్తున తిరుగుబాటు తప్పదన్నారు. కార్యక్రమంలో సిటూ నాయకులు ఆర్.ఎస్.వి.కుమార్, జి.శ్రీనివాస్, నమ్మి రమణ, ఎం.వి.రావు, సత్యవతి, రమణ, నారాయణరావు, ఆదిరెడ్డి శ్రీను, మసేను, సోమేష్, సుబ్రహ్మణ్యం, శశిభూషణ్, నర్సింగరావు ప్రసంగించారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల విక్రయాలు


రైతుమేళాలో ఏర్పాటుచేసిన స్టాల్

తుమ్మపాల: పట్టణంలోని గవరపాలెం రైతు కళా భారతి మందిరంలో రెండో రోజు ఆదివారం ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల విక్రయాలు కొనసాగాయి. ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు మేళాలో ఉత్తరాంధ్ర జిల్లాల ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తి సంఘాలు ఉత్పత్తులపై ప్రత్యేక విక్రయ శిబిరాలను ఏర్పాటు చేశాయి. ఆర్గానిక్ కూరగాయలు, పిండి వంటలు, ఆయుర్వేద ఉత్పత్తులను పట్టణ వాసులు అధిక సంఖ్యలో వచ్చి కొనుగోలు చేశారు. ముఖ్య అతిథిగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు డి.పరమేశ్వరరావు విచ్చేసి ప్రదర్శన, విక్రయ శాలలను సందర్శించారు. వివిధ ఉత్పత్తి సంఘాలు తయారు చేసిన ఉత్పత్తుల గురించి అడిగి తెలుసుకున్నారు. పంటను నేరుగా రైతే విక్రయించుకునే విధంగా ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయన్నారు. రైతుల ఉత్పత్తులను నేరుగా సంఘాల ద్వారా మార్కెటింగ్ చేసే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను వినియోగించడం ద్వారా ఆరోగ్యకరంగా జీవించగలమన్నారు. కార్యక్రమంలో ఏపీసీఎన్ఎఫ్ జిల్లా అధికారి లచ్చన్న, జిల్లా మార్కెటింగ్ ప్రతినిధులు వర్మ, అప్పలరాజు సిబ్బంది పాల్గొన్నారు.

విధి నిర్వహణలో బీఎస్ఎన్ఎల్ కాంట్రాక్టు కార్మికుడి మృతి


బాలరాజు మృతదేహం

కోటవురట్ల: బీఎస్ఎన్ఎల్ ఫైబర్ నెట్ పనులు చేస్తూ గుండెపోటుకు గురై కాంట్రాక్టు కార్మికుడు బాలరాజు మృతి చెందాడు. ఎస్ఐ ఎస్.రమేష్ ఆదివారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కోటవురట్ల శివారు రాట్నాలపాలేనికి చెందిన పెదపూడి బాలరాజు (29) శనివారం రామచంద్రపురం జంక్షన్ వద్ద బీఎస్ఎన్ఎల్ ఫైబర్ నెట్ పనులు చేసే క్రమంలో ఫైబర్ కేబుల్ లాగేందుకు నిచ్చెన పట్టుకుని వెళుతూ అకస్మాత్తుగా కుప్పకూలిపోయాడు. వెంటనే అతని సహచరులు కోటవురట్లలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించగా వైద్యులు పరీక్షించి గుండెపోటుతో మృతి చెందినట్టు నిర్ధారించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

ఏటా దేశంలో 25 శాతం వరకూ పంట నష్టం

ఆహార నష్ట నివారణపై అంతర్జాతీయ దినోత్సవంలో ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ ముకుందరావు


ఆహార నష్ట నివారణపై పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఏడీఆర్ ముకుందరావు

అనకాపల్లి: దేశంలో పంటకోత అనంతరం జరిగే వివిధ ప్రక్రియల్లో ఏటా 10 నుంచి 25 శాతం వరకూ నష్టం వాటిల్లుతుందని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్ సీహెచ్.ముకుందరావు తెలిపారు. ఆదివారం స్థానిక ఆర్ఏఆర్ఎస్ కార్యాలయంలో ఆహార నష్ట నివారణపై అంతర్జాతీయ దినోత్సవాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. వివిధ ఆహార పదార్థాలలో 2.2 శాతం మాత్రమే ప్రాసెసింగ్ చెయ్యబడుతుందన్నారు. పంటకోత అనంతర సాంకేతిక పరిజ్ఞాన విభాగం అధిపతి డాక్టర్ పి.వి.కె.జగన్నాథరావు మాట్లాడుతూ పంటకోత అనంతరం జరిగే నష్టాలను అరికట్టడానికి ఉపయోగించే ఆధునిక యంత్ర పరికరాలు, విలువ ఆధారిత ఉత్పత్తులపై వివరించారు. నర్సీపట్నం డివిజన్ ఫుడ్ ఇన్‌స్పెక్టరు రవికుమార్ మాట్లాడుతూ ఆహార పరిరక్షణ ప్రమాణాలు చట్టం, నాణ్యతా ప్రమాణాల చట్టం, ఆహార ప్యాకేజింగ్‌లో ఉండాల్సిన వివిధ అంశాల గురించి వివరించారు. సేద్య విభాగం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కె.వి.రమణమూర్తి మాట్లాడుతూ మనం పండిస్తున్న పంటలలో మూడో వంతు నష్టం జరుగుతుందన్నారు. ఆ నష్టం సుమారు రూ.92 వేల కోట్లుగా ఉందన్నారు. ఆహార నష్టం ఎక్కువగా ఉన్న దేశాలలో చైనా తర్వాత భారతదేశం రెండో స్థానంలో ఉందన్నారు. కొండెంపూడి ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ రాజ్‌కుమార్ మాట్లాడుతూ ఆహార వృథా, నష్టాన్ని అరికట్టడం అనేది మన గృహం నుంచే మొదలు పెట్టాలని కోరారు. గృహాల్లో మిగిలిన ఆహారాన్ని అవసరం ఉన్నవారికి అందించడం ద్వారా వృథా తగ్గించవచ్చన్నారు. అనంతరం ఆహార పదార్థాల నివారణ చర్యలు కరపత్రాలను ఏడీఆర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు ఉమామహేశ్వరరావు, కుసుమ, విశాఖ ఉమ్మడి జిల్లాల రైతులు, తదితరులు పాల్గొన్నారు.

సాహితీ సౌరభం

అనకాపల్లిలో అలరించిన శతాధిక కవి సమ్మేళనం


కవి సమ్మేళనాన్ని ప్రారంభిస్తున్న కళావేదిక చైర్మన్ కత్తిమండ ప్రతాప్ తదితరులు

అనకాపల్లి: కళల కాణాచిగా పేరొందిన అనకాపల్లిలో సాహితీ సుగంధం పరిమళించింది. కవుల ఊహా ప్రపంచం.. వారి సామాజిక చైతన్యం సాహితీ ప్రియులను అలరించింది. శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో ఆదివారం శతాధిక కవి సమ్మేళనం వేడుకగా జరిగింది. స్థానిక గవరపాలెం గౌరీ గ్రంథాలయంలో జరిగిన 139వ జాతీయ శతాధిక కవి సమ్మేళనంలో 160మంది కవులు పాల్గొన్నారు. రెండు తెలుగు రాష్ట్రాలైన ఏపీ, తెలంగాణతోపాటు ఒడిశా రాష్ట్రం, చెన్నై, బెంగళూరు, ముంబయి పట్టణాల నుంచి వచ్చిన తెలుగు కవులెందరో ఈ కార్యక్రమంలో పాల్గొని తమ కవితలు వినిపించారు. ఈ సందర్భంగా శ్రీశ్రీ కళావేదిక చైర్మన్ కత్తిమండ ప్రతాప్ మాట్లాడుతూ సామాజిక అసమానతలను రూపుమాపేలా కవిత్వం ఉండాలన్నారు. అందుకోసం తమ సంస్థ ద్వారా తెలుగుభాష, సాహిత్యం విస్తరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. సంస్థ కన్వీనర్ కొల్లి రమావతి మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా పేద కవులకు చేయూత అందిస్తూ, పుస్తక ప్రచురణకు ఆర్థికంగా సహకరిస్తున్నామన్నారు. ఉత్తరాంధ్రలో త్వరలో పెద్ద ఎత్తున సాహితీ సంబరాలకు సన్నాహాలు చేస్తున్నామని చెప్పారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ కె.కె.వి.నారాయణరావు ప్రసంగించారు. కళావేదిక జిల్లా అధ్యక్షుడు జి.ఎల్.ఎన్.శాస్త్రి అధ్యక్షతన కవి సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా మూడు పుస్తకాలను ఆవిష్కరించారు. 11 జిల్లాల కార్యవర్గాలతో ప్రమాణ స్వీకారం చేయించారు.